# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 24 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్..!

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నవంబర్ 23న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో తదుపరి ప్రధాన న్యాయమూర్తిని నియమించే ప్రక్రియను ప్రభుత్వం గురువారం ప్రారంభించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీజేఐ జస్టిస్ గవాయ్ తదుపరి సీజేఐని పేర్కొనాలని కోరుతూ రాసిన లేఖను శుక్రవారం అందించనున్నట్టు తెలిసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకం, బదిలీ, పదోన్నతులకు మార్గనిర్దేశం చేసే నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తే సీజేఐ నియామకాన్ని నిర్వహించడానికి అర్హత ఉంది. సంప్రదాయకంగా సీజేఐగా ఉన్నవారు 65 ఏండ్ల వయస్సు నిండినప్పుడు పదవీ విరమణ చేయడానికి ఒక నెల ముందు లేఖ పంపుతారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తుత సీజేఐ తరువాత అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. దీంతో ఆయనే సుప్రీంకోర్టు సీజేఐ అయ్యే అవకాశం ఉంది. ఆయన నవంబర్ 24న తదుపరి సీజేఐగా నియామకమవుతారు. 2027 ఫిబ్రవరి 9 వరకు దాదాపు 15 నెలల పాటు ఆ పదవిలో ఉంటారు.

# 3 తర్వాతే స్థానికంపై నిర్ణయం

- హైకోర్టులో వాదనల తర్వాత నవంబర్ 7న మళ్లీ మంత్రివర్గ సమావేశం
- ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతపై ఆర్డినెన్స్
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు కొనసాగింపు
- యుద్ధప్రాతిపదికన 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం
- రాష్ట్ర క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికలపై నవంబర్ 3వ తేదీ హైకోర్టులో వాదనలు ఉన్నందున, అవి పూర్తయ్యాకే దానిపై తుది నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రమంత్రివర్గం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఆ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. ఈనెల 7వ తేదీ మళ్లీ మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. దానిలోనే స్థానిక సంస్థల ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. అలాగే శ్రీశైలం నుంచి ఫ్లోరైడ్ ప్రాంతమైన నల్గొండకు గ్రావిటీ ద్వారా టన్నెల నుంచి తాగు నీరు తెచ్చేందుకు 44 కి.మీ., ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు అప్పటి సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈటన్నెల్ నిర్మాణం దాదాపు 32 కి.మీ., పూర్తయ్యిందనీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేనందున కేవలం 2.5 కి.మీ., పనుల మాత్రమే పూర్తి చేసిందని చెప్పారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దురదృష్టవశాత్తు సొరంగ ప్రమాదం జరిగి, 11 మంది మరణించారని చెప్పారు. పలు సమీక్షల అనంతరం ఆ ప్రాజెక్ట్ పనులను పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని వివరించారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసేందుకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లో సెక్షన్ 21(3)ని తొలిగించాలని మంత్రివర్గం నిర్ణయించి ందని చెప్పారు. ఆర్డినెన్స్ ద్వారా పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ చేసి, దీన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించామన్నారు. ఎల్‌బీ నగర్, సనత్‌నగర్, వరంగల్, అల్వాల్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. 1500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గ ఆమోదం లభించింది. రామగుండం థర్మల్ స్టేషన్‌లో 62.5 మెగావాట్ల పాత ప్లాంట్ కూల్చివేతకు మంత్రివర్గం ఆమదోం తెలిపిందన్నారు. అలాగే వచ్చే పదేండ్లకు సరిపడేలా సోలార్, బ్యాటరీ, రివర్స్‌పంపింగ్ ప్రతిపాదనల్ని వచ్చే మంత్రివర్గ సమావేశం నాటికి ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించామని తెలిపారు.

## రూ.79 వేల కోట్లతో ఆయుధాల కొనుగోళ్లు

- త్రివిధ దళాల కోసం కొనుగోళ్లు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**




ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ సామర్థ్యాన్ని పెంపుచేయాలని కేంద్రం ఉద్ఘాటించిన ఛాయలో డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ కీలక నిర్ణయాలను అనుమోది చేసింది. రక్షణ మంత్రి లిలిరాజ్‌నాథ్ సింగ్‌లిలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు రూ.79,000 కోట్లులిలి విలువ చేసే ఆయుధ–సైనిక హార్డ్‌వేర్ కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఇది ఆపరేషన్ తర్వాత తీసుకున్న రెండో పెద్ద నిర్ణయంగా ఆ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ముందుగా రూ.67,000 కోట్లవరకు ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని నియామకాలు ఆ ప్రతిపాదనల గొప్పతనాన్ని తెలుపుతున్నాయి.

డీఏసీ ఆమోదం పొందిన ప్రధాన సందర్భస్తావ్యాలలో భారత నౌకాదళానికి సంబంధించిన లిలిల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్ , 30 మిమీ నావల్ సర్ఫేస్ గన్స్ , ఆధునిక లిలితేలికపాటి టార్పెడోస్, లిలిఎలెక్ట్రో–ఆప్టికల్ ఇన్‌ఫ్రా–రెడ్ సర్చ్ అండ్–ట్రాక్ సిస్టమ్‌లిలి, 76 మిమీ సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్స్‌లిలి వంటి పరికరాలు ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది.ఎల్‌పీడీలు భారీ సామాగ్రిని రవాణా చేయడం, సైనికులను దింపడం, మానవతా సహాయం–విపత్తు సహాయ కార్యకలాపాలు నిర్వహించడం వంటి అనేక రకాల మిషన్లకు ఉపయోగపడతాయని పేర్కొంది. డీఆర్‌డీఓ–లోని నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ ల్యాబొరేటరీ ద్వారా స్వదేశీ అభివృద్ధి చేసిన ALWTs సంప్రదాయ, అణు, మిడ్జెట్ జలాంతర్గాములను లక్ష్యంగా సక్రమంగా పనిచేయగలంగా ఉల్లేఖించబడింది.

భారత భూ దళాల సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి లిలినాగ్ క్షిపణి వ్యవస్థ TRACKED Mk-II NAMIS, గ్రౌండ్–బేస్డ్ మొబైల్ ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ , అధిక చలనా సామర్థ్య గల వాహనాల కొరకు కొనుగోలు ఆమోదం కూడా దక్కింది. NAMIS కొనుగోళ్లు శత్రు యుద్ధ వాహనాలు, బంకర్లు, ఫీల్డ్–ఫోర్టిఫికేషన్లను లక్ష్యంగా పెట్టుకొని అవి పనిచేయగలవని, GBMES ఎలక్ట్రానిక్ గూఢచర్యం సమాచారాన్ని అందించడం ద్వారా మెరుగైన ప్రమాద గుర్తింపు సాధ్యమవుతుందని అధికారులు వివరించారు. HMVS లతో విభిన్న భౌగోళిక పరిధులలో దళాలకు రక్షణ, లాజిస్టిక్ మద్దతు బలవంతమవుతుందని పేర్కొన్నారు.

విమాన దళానికి సంబంధించి లిలికోలబరేటివ్ లాంగ్–రేంజ్ టార్గెట్ సాచురేషన్/డిస్ట్రక్షన్ సిస్టమ్ కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. ఈ సిస్టమ్‌లకు టేకాఫ్–ల్యాండింగ్, నావిగేషన్ సామర్థ్యాలపైన అదనపు స్వాతంత్ర సాధనాలు, లక్ష్య గుర్తింపు, మిషన్ ఏరియాలో పేలోడ్ అప్లికేషన్లు ఉండడంతో వాయుసేనాకు సమగ్ర మద్దతు అందనున్నట్లు బోర్డు పేర్కొంది.

ప్రభావవంతమైన రక్షణ ఐటెంల పై భారీ మొత్తంలో ఆమోదాలు పొందడంతో రక్షణార్ధ అభివృద్ధి, సమూహాత్మక త్రివిధ దళాల సహకారం పెంపుకు కేంద్రం వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 2035 నాటికి "సుదర్శన చక్ర" వంటి సమగ్ర రక్షణ కవచాన్ని నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారిక వృందాలు వివరించారు. ఈ కొరియర్–ఎజిక్ నిర్ణయాలు భారత రక్షణ శక్తిని దృఢం చేసే దిశగా ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తాయని నిపుణుల విశ్లేషణలు సూచిస్తున్నాయి.

## 900 కిలోల గంజాయి పట్టివేత

- సుమారు రూ. 2 కోట్ల విలువగల గంజాయిగా గుర్తింపు
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రూ. 2 కోట్ల 22 లక్షల విలువైన దాదాపు 900 కిలోల, గంజాయిను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ ఎస్. చైతన్య కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. బండ్లగూడ మెయిన్ రోడ్‌లో ఓఎస్ ఫంక్షన్ హాల్ ముందు నిలిచున్న ఆచార్ డీసీఎం వాహనంలో మాదకద్రవ్యాలుననట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఈస్ట్ సౌత్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, బండ్లగూడ పోలీసులు కలిసి వెంటనే అక్కడకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. వాహనంలో అక్రమంగా గంజాయి పట్టుబడటంతో లారీ డ్రైవర్ మహమ్మద్ ఖలీముద్దీన్ అలియాస్ ఫరీదుద్దీన్, షేక్ సోహెల్, మహమ్మద్ అఫ్జల్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాజిగిరి అలీముల్లా గ్రామం నుంచి మహారాష్ట్ర నాసిక్ వైపు తీసుకువెళ్తున్నట్టు విచారణలో వెల్లడైంది.

అలాగే గంజాయి వ్యాపారం రెహమాన్ అనే వ్యక్తి ద్వారా నిర్వహిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. అతని స్నేహితులు ఒరిస్సా నివాసి జిత్తు, ఆంధ్రప్రదేశ్ నివాసి సురేష్ కలిసి ఈ వ్యాపారంలో ఉన్నారని చెప్పారు. వీరు గత మూడు నెలలుగా ఈ వ్యాపారం నిర్వహిస్తూ ఒక్కొక్కరు రూ.3 నుంచి 4 లక్షల సంపాదిస్తున్నారని, ఒకేసారి ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడం ద్వారా అధిక లాభం పొందడానికి ప్రయత్నించారని తెలిపారు. రెహమాన్ పరారీలో ఉన్నందున త్వరలో పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. పట్టుకున్న వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక ఐచర్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ (టీఎస్12 యూడీ 9327), రూ. 2,500 నగదు జప్తు చేశారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆది శ్రీనివాస్ రావు, ఏసీపీ ఏ. సుధాకర్ చంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు, సీఐ. ఆర్. దేవేందర్, ఎస్సైలు కె. రామారావు, ఎం. మధు, డీ. సుభాష్, కానిస్టేబుళ్లు గులాం చాంద్ పాషా, కె. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత కక్ష్యల నేపథ్యంలో కాల్పులు

- కాల్పుల కేసును 12గంటల్లో ఛేదించిన రాచకొండ పోలీసులు
- రాచకొండ సీపీ జీ.సుధీర్‌బాబు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కాల్పుల కేసును రాచకొండ పోలీసులు 12గంటల్లో ఛేదించారు. సమాచారం అందిన వెంటనే పోచారం ఐటీ కారిడార్ పోలీసులు స్పందించడం, సకాలంలో గాయపడిన యువకున్ని ఆస్పత్రిలో చేర్పించడంతో బాధితుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వ్యక్తిగత లాభాల కోసమే పోచారంలో కాల్పుల ఘటన జరిగిందని, నిందితుడిని 12గంటల్లో పట్టుకున్నామని రాచకొండ సీపీ జీ.సుధీర్‌బాబు తెలిపారు. గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బండ్లగూడకు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఖురేషి గత 12ఏండ్ల నుంచి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పశువులను రావాణా వ్యాపారం చేస్తున్నాడు. షాబాదాకు చెందిన కుర్వ శ్రీనివాస్, పశువులను రవాణా చేసే కలాపత్తర్‌కు చెందిన హస్సాన్‌బిన్ మోసిన్, రాజేంద్రనగర్‌కు చెందిన మహ్మద్ హనిఫ్ ఖురేషీలు స్నేహితులు. కీసర మండలం, రాం పల్లికి చెందిన ప్రశాంత్ కుమార్ అలియాస్ సోను సింగ్. ఇతను గో సంరక్షణ కార్యకర్త. ఎక్కడైనా ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్టు కనిపిస్తే తోటి గో సంరక్షణ కార్యకర్తలకు సమాచారం చేరవేస్తాడు, దీంతో పలు మార్లు తన ఆవులను కళేభారాలకు వెళ్లకుండా పోలీసులకు సమాచారం ఇచ్చి తన వ్యాపారానికి అడ్డ వస్తుండడంతో ఇబ్రహీం ఖురేషి దాదాపు కోటి రూపాయాల వరకు నష్టపోయాడు. అలాగే ఇబ్రహీంపై ఈ ఏడాది ములుగు, గజ్వేల్, శంషాబాద్ రూరల్, ఘట్‌కేసర్ తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాగా, 2024లో శంషాబాద్ రూరల్, 2022లో కమాటిపురాలో కేసులు నమోదుకావడంతోపాటు అక్రమ రవాణాకు సంబంధించిన వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో సోనుసింగ్, ఇబ్రహీం రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఎలాగైనా సోనుసింగ్ అడ్డు తొలిగించుకోవాలని బావించిన ఇబ్రహీం చత్తీష్‌ఘడ్‌లోని తన స్నేహితుని నుంచి కంట్రీమేడ్ తుపాకిని కొనుగోలు చేసి ఆరాంఘర్‌కు చెందిన ఓ డ్రైవర్‌తో తెప్పించుకున్నాడు.

నిందితుల్లో ఒకడైన శ్రీనివాస్‌కు సోనుసింగ్‌తో పరిచయం ఉంది. ఈ క్రమంలో బుధవారం ఇబ్రహీంకు సంబంధించిన మ్యాటర్ సెటిల్ చేద్దామని శ్రీనివాస్ సోనుసింగ్‌తో చెప్పాడు. శంషాబాద్ రావాలని సూచించాడు. అందుకు నిరాకరించిన సోనుసింగ్ తాను చెప్పిన విధంగా ఘట్‌కేసర్‌వైపు రావాలని చెప్పాడు. ఈ క్రమంలో సాయంత్రం 5గంటల ప్రాంతంలో అందరు కలిసి రెట్రోహెూటల్ వద్ద కలుసుకున్నారు. ఇబ్రహీం, హనీఫ్ ఖురేషి, హస్సాన్, శ్రీనివాస్, సోనుసింగ్‌లు దాదాపు గంటసేపు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత హెూటల్ సమీపంలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలోని వెంచర్‌లోకి వెళ్లారు. ఈ మాటల సందర్భంగా కోటిరూపాయల నష్టం జరిగిందంటూ ఇబ్రహీం ప్రస్తావించడం, రూ.5లక్షలు కావాలని సోను సింగ్ డిమాండ్ చేయడంతో ఇరువురిమధ్య మాటా మాట పెరిగింది. ఈ క్రమంలో సోనూ సింగ్‌పై రెండు రౌండ్లు కాల్పులు జరిపిన ఇబ్రహీం అక్కడి నుండి పరారయ్యాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి ఒక పిస్తోల్, రెండురౌండ్లు, ఒక కార్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నట్టు సీపీ వెల్లడించారు. సోను ప్రస్తుతం యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. నేరం చేసినవారు ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదని, చట్టానికి ఎవరూ అతీతులు కారన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, .వదంతులను నమ్మొద్దని సీపీ కోరారు. ఈ సమావేశంలో డీసీపీ పద్మాజారెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, ఏసీపీ రమేష్‌తోపాటు పోచారం, ఉప్పల్, మాల్కాజ్‌గిరి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు

- రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గ్రూప్–2 నియామకాలకు ఎంపికై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్‌లుగా నియమితులైన 14మంది ఉద్యోగులను అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన సబ్ రిజిస్ట్రార్‌లకు ఇండియన్ స్టాంప్ యాక్ట్ బుక్ లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ "గత ప్రభుత్వం దశాబ్ద కాలం ఉద్యోగాల నియామక ప్రక్రియలలో చూపించిన అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత కన్నకలలు కలలుగానే మిగిలి పోయాయి. అంతే కాదు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అరకొర ఉద్యోగాల్లో అక్రమాలు,పేపర్ లీకేజీలు, అసమర్ధ పరీక్షా నిర్వహణ వల్ల అర్హులైన యువతకు ఉద్యోగాలు రాలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం గత 20 నెలల్లో సుమారు 70 వేలకు పైగా ఉద్యోగ నియమాకాల భర్తీ చేసింది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో జీపీవోల నియామకం, హౌసింగ్ శాఖ విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్దతిలో సుమారు 350 మంది ఇంజినీర్లు, సర్వే విభాగంలో 3465 మంది లైసెన్సడ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది" అని అన్నారు.

కొత్తగా ఉద్యోగాల్లో చేరిన అధికారులు ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా నిజాయితీ, నిబద్దత, అంకితభావం,క్రమశిక్షణతో పనిచేయాలి. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలని సూచించడం జరిగింది

### హైదరాబాద్‌లో
## సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికాకు చెందిన ప్రఖ్యాత విమానయాన సంస్థ సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో జరిగిన సమావేశంలో సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి బృందం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. ప్రపంచ పెట్టుబడులకు, సాంకేతిక ఆవిష్కరణలకూ కేంద్రంగా నిలుస్తోన్న హైదరాబాద్ నగరంలో గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ స్థాపన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలు, అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా, 2034 నాటికి తెలంగాణను $1 ట్రిలియన్, 2047 నాటికి $3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లారెన్ వుడ్స్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ టామ్ మెరిట్, హెడ్ లీగల్ కౌన్సిల్ జాసన్ షైయింగ్, HEX అడ్వైజరీ గ్రూప్‌కు చెందిన సార్థక్ బ్రహ్మ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో భారీ మెజారిటీకి ప్రయత్నించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యింది
- జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీ తన అభ్యర్థిగా రౌడీషీటర్‌ను నిలబెట్టింది
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన ఉప ఎన్నికలో మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును జూబ్లీ హిల్స్ ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని, పార్టీ నేతలు ప్రజలవద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలన పట్ల మరింత అవగాహన కల్పించి భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉన్నదని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు.నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యిందని, ఇక జూబ్లీహిల్స్ లో తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్ ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విజ్ఞులైన జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన రౌడీ షీటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అభ్యర్థిని చిత్తుగా ఓడించి, జూబ్లీ హిల్స్ గౌరవాన్ని హైదరాబాద్లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన, ఎర్రవెల్లి నివాస ప్రాంగణంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో.. పోటీలో ఉన్న అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్ సహా, ఉప ఎన్నిక కోఆర్డినేటర్లుగా ఉన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు...హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జి. జగదీశ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పాల్గొన్నారు.

వీరితో పాటు... జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు పాల్గొన్నారు. వారిలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు,మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తదితర పార్టీ కీలక నేతలు పాల్గొన్నారు.

ఈ సమావేశం సందర్భంగా... పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా ఇప్పటికే ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతున్న నేపథ్యంలో... క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా కొనసాగుతున్న ప్రచారం సంబంధిత అంశాల మీద అధినేత కు ఇంచార్జీలు రిపోర్ట్ చేశారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి, అధినేత కేసీఆర్ గారు సమావేశంలో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి గురించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన ప్రమాదకర పరిస్థితులను గురించి వారికి ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ నేతలకు అధినేత కేసీఆర్ ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనా కాలంలో అమలు చేసిన అభివృద్ధికార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని అధినేత సూచించారు.

## పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను ప్రభుత్వ పరీక్షల విభాగం ప్రకటించింది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 13 వరకు విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు (హెచ్ఎంలకు) ఫీజు చెల్లించవలసి ఉంటుందని పేర్కొంది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14వ తేదీలోపు ఫీజు చెల్లింపును పూర్తి చేయాలని, విద్యార్థుల వివరాలను నవంబర్ 18లోపు డీఈఓలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రూ. 50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ. 200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 2 నుంచి 11 వరకు, రూ. 500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 15 నుంచి 29 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ప్రభుత్వం తెలిపింది.



## ఇండియా బ్లాక్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీహార్‌లో మహాఘట్బంధన్ తరపు సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ అగ్ర నాయకుడు తేజస్వి యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లాట్ వెల్లడించారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అశోక్ గెహ్లాట్‌ను బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం సీనియర్ ఎన్నికల పరిశీలకుడిగా నియమించింది.పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీలను సంప్రతించిన అనంతరం తేజస్వియాదవ్‌ను ప్రతిపక్ష కూటమి తరపు సీఎం అభ్యర్థిగా ఎన్నుకోవాలని నిర్ణయించామని గెహ్లాట్ పట్నాలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పారు. వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడు ముఖేశ్ సహానీని డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తేజస్వి యాదవ్ యువకుడని, ఆయనకు సుదీర్ఘ భవిష్యత్తు ఉన్నదని ఆయన అన్నారు. దేశంలో అనేక సమస్యలు ఉన్నాయని, అయినా అధికార ఎన్డీయూ కూటమికి పట్టింపులేదని గెహ్లాట్ విమర్శించారు. ఎన్డీయే సర్కారు పాలనాతీరు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో కూడా ఎన్డీయే సర్కారు తీరుతో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆరోపించారు. అధికార కూటమి పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. కాగా బీహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్లను లెక్కించనున్నారు. అధికార ఎన్డీయే, ప్రతిపక్ష మహాఘట్బంధన్ కూటమిల మధ్య ప్రధానంగా పోరు జరగనుంది.

## 81 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను ఈవీఎంల ద్వారానే నిర్వహించనున్నారు. ఎవరూ ఊహించని విధంగా మొత్తం 211 మంది 321 నామినేషన్‌లు వేశారు. గురువారం నిర్వహించిన స్క్రూటినీ ప్రక్రియలో 321 నామినేషన్లకుగాను 135 ఆమోదించిన అధికారులు, 186 తిరస్కరించారు. ఇక 211 అభ్యర్థులలో 81మందిని ఆమోదించి 130మందిని తిరస్కరించారు. చివరకు 81 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించిన నేపథ్యంలో ఈవీఎంలతోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉప్ప ఎన్నికల పోలింగ్ కోసం ఆరు ఈవీఎంలు, మూడు కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో ఈవీఎంలో 16 మంది అభ్యర్థులకు సంబంధించిన వివరాలు ఉండడంతో ఒక వేళ 81 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే 6 ఈవీఎంలను ఏర్పాటు చేయనున్నారని సమాచారం. 24(నేటి) వరకు అభ్యర్థులు తమ నామినేషన్లకు విత్‌డ్రా చేసుకోవడానికి సమయం ఉంది.

## త్వరలో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీ

- మంత్రి శ్రీధర్ బాబు

బలగం టీవీ, హైదరాబాద్



రాష్ట్రాన్ని గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరిశ్రమలు, ఐటీ మరియు వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. త్వరలో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. శ్రీధర్ బాబు ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'ఆస్ బయోటెక్' సదస్సులో పాల్గొన్న ఆయన, తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగాన్ని 250 బిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి చేర్చడమే లక్ష్యమని, ఇప్పటికే ఏడాదిన్నరలో రూ. 3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి ఆకర్షించామని తెలిపారు. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుండి హైదరాబాద్‌కే స్థానం లభించిందని గర్వంగా పేర్కొన్నారు. బయో డిజిటల్ రంగంలో అవసరమైన నైపుణ్యాలను యువతలో అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

## వరుసగా ఆరో రోజు లాభాలు

బలగం టీవీ, హైదరాబాద్

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల బాటలో పయనించాయి. ముఖ్యంగా ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్ల వెల్లువతో గురువారం కూడా సూచీలు లాభాలతో ముగిశాయి. అయితే, ట్రేడింగ్ చివరి గంటల్లో లాభాల స్వీకరణ జరగడంతో సూచీలు ఇంట్రాడే గరిష్ఠాలనుంచి కాస్త కిందకు జారాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే బీఎస్ఈ సెన్సెక్స్ 864 పాయింట్లు ఎగసి 85,290 వద్ద కొత్త 52 వారాల గరిష్ఠం తాకింది. చివరికి మాత్రం 130 పాయింట్ల స్వల్ప లాభంతో 84,556 వద్ద ముగిసింది ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 26,104 స్థాయికి చేరినప్పటికీ, చివరికి కేవలం 23 పాయింట్ల లాభంతో 25,891 వద్ద ఫ్లాట్‌గా స్థిరపడింది. విశ్లేషకుల మాటల్లో ః "ఉదయం లాభాలను మార్కెట్ చివరికి కోల్పోయింది. అయితే ఐటీ షేర్ల మద్దతు మార్కెట్ స్థిరత్వానికి తోడ్పడింది" అన్నారు. ఐటీ రంగ షేర్లు ఈ రోజు ర్యాలీకి ప్రధాన కారణమయ్యాయి. ఇన్ఫోసిస్ ప్రమోటర్లు రూ.18,000 కోట్ల బైబ్యాక్‌లో పాల్గొనబోమని ప్రకటించడంతో షేరు 4% లాభపడింది.

# వృద్ధులను హింసకు గురిచేసేది సొంత పిల్లలు, బంధువులే....

- వృద్ధాప్యం మరో పసితనం
- వృద్ధులు కాదు.. మన బతుకునిర్దేశకులులి
- పండుటాకులపై మాజీ డిఎస్పి దామెర నర్సయ్యతో బలగం టీవీ ప్రత్యేక ఇంటర్వ్యూ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

జీవక్రమంలో బాగంగ పుట్టిన ప్రతి మనిషి వృద్ధులౌతారు, శారీరక మార్పుల వలన శరీర పటుత్వం తగ్గి తమ పనులు తాము చేసుకోలేక పోతారు,కొన్ని సందర్భాల్లో మానసిక స్థితి కూడా దెబ్బతింటుంది. అలాంటి వారికి వారి సంతానం కుటుంబ సభ్యులు సహకరించాలి, కానీ వారి సంతానానికి వృద్దాప్యం శాపమైంది. అంతేకాకుండా కొన్ని సంఘటనలు హృదయ విదారకంగా ఉన్నాయి/ఉంటున్నాయి, బ్రతికున్నవారిని శ్మశానవాటికలలో వదిలేస్తు న్నారు. ఊరికి వెళ్దామని చెప్పి వృద్ధులను బస్టాండులో కూర్చోబెట్టి, ఇక్కడనే కూర్చోండి అని, ఇప్పుడే వస్తామని చెప్పి బస్టాండుల్లో, రైల్వే స్టేషన్లలో వదిలి వెళ్తున్నారు. వారి శేష జీవితం వృద్ధాశ్రమాలలో,అనాథ శరణాలయాలలో గడపాల్సిన పరిస్థితి దాపురించింది.వృద్ధుల జనాభా నానాటికి పెరుగుతున్న, దానికను గునంగ వారి జీవన ప్రమాణాలు పెరగడం లేదు. ఒకవైపు వృద్ధులను గౌరవిద్దామని, ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం, జాతీయ వయోవృద్ధుల దినోత్సవం అని ప్రకటించి కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. అధికారుల అవగాహన లోపమో, చిత్తశుద్ధి లేకనో ఇలా జరిపే కార్యక్రమాలు వృద్దుల జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకురాలేదు.

**తల్లిదండ్రులు ఎవరు.. వయోవృద్ధులు ఎవరు...?**

60 సంవత్సరాల వయస్సు పైబడ్డ వారందరూ వయోవృద్ధులే కాని వయోవృద్ధులు అందరు తల్లిదండ్రులు కారు. పిల్లలున్న వారు మాత్రమే తల్లిదండ్రులు లేనివారు వయోవృ ద్ధులు. తల్లిదండ్రులను పోషించి సంరక్షించడం వారి పిల్లల బాధ్యత. పిల్లలు లేని వయోవృద్ధుల ఆస్తులను అనుభవించేవారు వారిని పోషించి సంరక్షించాలి.

**వృద్ధుల భావోద్వేగా వేధింపులకు పాల్పడేవారు ఎవరు?**

వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు, కొన్ని



సందర్భాల్లో హింసకు కూడ గురౌతు న్నారు. విచిత్రంగా వారిని నిరాదరణకు, హింసకు గురిచేసేది ఎవరో కాదు, స్వంత పిల్లలు, బంధువులే.

**వృద్ధులకు ఏమైనా చట్టాలు ఉన్నాయా..?**

వృద్ధులు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టాన్ని రూపొందించారు.వయోవృద్ధుల ఆస్థిరక్షణ, ప్రాణరక్షణ ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగ ఈ చట్టంలో ఉన్నది, దాని అమలుకు 2011 సంవత్సరంలో నియమావళిని రూపొం దించారు. చాల మంది ప్రభుత్వాధికారులకు ఇలాంటి చట్టం ఒకటున్నదని కానీ దానిపై అవగాహన కానీ లేదు.

**ఎవరు లేని వారికి ఎవరు బాధ్యత వహించాలి..?**

పిల్లలు, ఆస్తులు రెండూ లేనివారి కొరకు సెక్షన్ 19 ప్రకారం ప్రభుత్వాలే శరణాలయాలు ఏర్పాటు చేసి వారికి పోషణ రక్షణ కల్పించాలి.

**తల్లిదండ్రుల బాధ్యత వారి సంతానం చూసుకోకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి..?**

తల్లిదండ్రుల ఆస్తులు పంచుకొని పిల్లలు వారిని నిరాదరణకు గురిచేస్తే సెక్షన్ 23 ప్రకారం ఆ తల్లిదండ్రులు ఆర్డీవోకు పిర్యాదు చేసి, పిల్లలు మమ్ములను చూడడం లేదు, మా ఆస్తి మాకు తిరిగి ఇప్పించండి అని కోరితే విచారణ జరిపి ఆర్డీవో

ఆ ఆస్థిని తల్లిదండ్రులకు తిరిగి బదలాయించే అధికారమున్నది. ఆ తీర్పును వ్యతిరేకిస్తూ జిల్లా కోర్టులో సవాలు చేసే అవకాశం లేదు. కలెక్టర్ కి అప్పీలో లేక హైకోర్టులో సవాలో చేయాలి.

**వృద్ధులకు పోలీస్ వ్యవస్థ ఎలా సహాయపడుతుంది..?**

సెక్షన్ 21 ప్రకారం ప్రతి పోలీస్ స్టేషన్లో ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో గల వయోవృద్ధుల జాబితా ఉండాలి, వారి పై జరిగే నేరాల నమోదు కొరకు ప్రత్యేక రిజిస్టర్ ఉండాలి. ప్రతి మూడు నెలలు మించక ముందు సదరు పోలీస్ అధికారులు ఆయా వయోవృద్ధుల నివాసాలను సందర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకోవాలి.

**వృద్ధుల కోసం ఏమైనా సంరక్షణ కమిటీలు ఉన్నాయా..?**

ప్రతి పోలీస్ స్టేషన్లో ఒకటి కాని అంతకంటే ఎక్కువ కాని వృద్ధుల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ కమిటీలో సభ్యులుగా వయోవృద్ధుల సంఘంనుండి ఒకరు, స్వచ్ఛంద సంస్థలనుండి ఒకరు, స్త్రీ సిశు సంక్షేమ కమిటీనుండి ఒక స్త్రీ, యూనిఫారం సర్వీసు నుండి పదవీవిరమణ పొందినవారు ఒకరు ఉండాలి.

**వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఏమైనా వైద్య పరంగా హక్కులున్నాయా...?**

సెక్షన్ 20 ప్రకారం ప్రభుత్వ లేక ప్రభుత్వ నిదులతో నిర్వహించే ఆసుపత్రులలో వృద్ధులకు ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేయాలి. వారికి ప్రత్యేక క్యూ లైను ఉండాలి. చిన్నపిల్లలకు ఉన్నట్లు వృద్ధులకు కూడా ప్రత్యేక వైద్య విభాగం ఉండాలి. వృద్ధులకు వచ్చే జబ్బుల పై పరిశోధనలు జరగాలి. పీడియాట్రిక్ వలె జీరియాట్రిక్ విభాగం ఉండాలి.

**వృద్ధుల కోసం బ్యాంకింగ్ ఎటువంటి సేవలు అందించాలి...?**

వృద్ధుల కోసం ప్రతి బ్యాంకులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. 60-70, 70-80 వయసు గలవారికి డిపాజిట్లు పై ఇతరులకంటే వడ్డీ శాతం ఎక్కువ ఉండాలి. ఆదాయపు పన్నులో ప్రత్యేక మినహాయింపులు ఉండాలి. కదిలే పరిస్థితి లేని వృద్ధులకు బ్యాంకు సిబ్బంది వారి ఇంటివద్దే బ్యాంకు సేవలు అందించాలి.

**వృద్ధుల కోసం ప్రభుత్వం ఇంకా ఏమైనా చేయాల్సి ఉన్నదా..?**

ప్రతి జిల్లాలో వృద్ధుల కొరకు గ్రంథాలయం, ఇండోర్ గేమ్స్, యోగా, జిమ్ మరియు ఫిజియోథెరపీ సౌకర్యాలతో ఒక డే కేర్ సెంటర్ ఏర్పాటు చెయ్యాలి. వృద్ధులకు చట్ట ప్రకారం రావాల్సిన హక్కులు. ఇవన్నీ తూచ తప్పక పాటిస్తే ప్రభుత్వం శ్రద్ధపెడితే వృద్ధులకు గౌరవ ప్రదమైన జీవనం లబిస్తుంది.

# డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- గో రక్షక్ దళ్ కాల్పులపై బీజేపీ ఆందోళన
- పలువురు నేతలను అదుపులోకి తీసుకన్న పోలీసులు

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. గో రక్షక్ దళ్ సభ్యుడు సోనూ సింగ్‌పై జరిగిన కాల్పుల ఘటనపై బీజేపీ నేతలు గురువారం ఆందోళనకు దిగారు. ఈ ఘటనను నిరసిస్తూ డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు పలువురు బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. దశలవారీగా డీజీపీ కార్యాలయానికి చేరుకుంటున్న బీజేపీ సభ్యులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.



ఇదిలా ఉండగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు కాసేపట్లో డీజీపీ కార్యాలయానికి చేరుకోనున్నారు. గోరక్షక్ దళ్‌పై జరిగిన కాల్పుల ఘటనపై డీజీపీకి మెమొరాండం ఇవ్వడానికి ఆయన సిద్ధమవుతున్నారు. సంభవించే అనూహ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డీజీపీ కార్యాలయం పరిసరాల్లో, రవీంద్రభారతి, అసెంబ్లీ ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నిప్పులపై నడిచిన ఐఏఎస్ అధికారి!

బలగం టీవీ, హైదరాబాద్

కర్ణాటకలో ఓ ఐఏఎస్ అధికారిణి తన భక్తిని చాటుకున్నారు. హసన్ జిల్లా డిప్యూటీ కమిషనర్ (డీసీ) కేఎస్. లతా కుమారి గురువారం ప్రసిద్ధ హసనాంబ ఆలయంలో జరిగిన అగ్నిగుండం (కెండోత్సవం) కార్యక్రమంలో పాల్గొని, నిప్పులపై నడిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిప్పు కణికలపై చెప్పులు లేకుండా నడుస్తున్న లతా కుమారి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భక్తులు, స్థానికులు ఆమె ధైర్యం మరియు భక్తిని ప్రశంసిస్తున్నారు. బుధవారం రాత్రితో ముగిసిన హసనాంబ ఆలయ వార్షికోత్సవాల అనంతరం గురువారం ఉదయం సంప్రదాయబద్ధంగా కెండోత్సవం నిర్వహించారు. ఏడాది పాటు ఆలయ గర్భగుడిని మూసే ముందు ఈ క్రతువును జరపడం ఆ ఆలయ ఆనవాయితీ. గులాబీ రంగు చుడీదార్ ధరించి కార్యక్రమంలో పాల్గొన్న డీసీ లతా కుమారి, నిప్పులపై నడుస్తున్నప్పుడు భక్తులు హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆమె తెలిపారు ః "భక్తులు పవిత్ర కలశాలతో నిప్పులపై నడుస్తుండటం చూసి నాకు స్ఫూర్తి కలిగింది. ఇంతకుముందెప్పుడూ నేను ఇలా చేయలేదు. మొదట భయమేసింది కానీ దేవుడిపై నమ్మకంతో దండం పెట్టుకుని నడిచాను. నాకేమీ కాలేదు," అని పేర్కొన్నారు. 13 రోజుల పాటు సాగిన ఈ హసనాంబ జాతర మహోత్సవానికి ఈసారి విశేష స్పందన లభించింది. సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు సుమారు 26 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా. ప్రత్యేక దర్శన టిక్కెట్లు, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా ఆలయానికి సుమారు రూ. 20 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం. భక్తుల సంఖ్య, ఆదాయ వివరాలపై అధికారులు త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నారు.

# బీసీ బిల్లును ఆమోదిస్తారా... రాజీనామా చేస్తారా..?

- బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడికి యత్నం

బలగం టీవీ, హైదరాబాద్

బీసీ బిల్లును వెంటనే ఆమోదించాలనీ, లేదంటే గవర్నర్ తన పదవికి రాజీనామా చేయాలనీ బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం తొమ్మిదవ షెడ్యూల్ (9వ షెడ్యూల్)లిలిలో చేర్చాలనే డిమాండుతో గురువారం బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యం లో "చలో రాజ్ భవన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాజ్ భవన్ ముట్టడికి బయల్దేరిన బీసీ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో వారు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.

డా. రాచాల మాట్లాడుతూ "తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను గవర్నర్ తన వద్దనే ఉంచుకుని సంతకం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. గవర్నర్ కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తూ బీసీల హక్కులను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం," అని విమర్శించారు.అలాగే, బీజేపీ ఎంపీలు కూడా కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదని, రాష్ట్ర



ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని గవర్నర్ నిలువరించడం "బీసీలను రాజకీయంగా వెనక్కి నెట్టే కుట్ర"గా ఆయన అభివర్ణించారు. "గవర్నర్ వెంటనే ఆర్డినెన్స్‌పై సంతకం చేయాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేలా చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ పరిరక్షణ కోసం, బీసీల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది," అని రాచాల యుగంధర్ గౌడ్ హెచ్చరించారు. తదనంతరం నాయకులు గవర్నర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో అల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి. కిరణ్ కుమార్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజు గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంచార్జి గణేష్ గౌడ్, నాయకులు అయిలి వెంకన్న, దుర్గయ్య గౌడ్, సింగం నాగేష్, బైరు శేఖర్, వివి గౌడ్, గోటూరి రవీందర్, గూడూషా, అంజన్న యాదవ్, దేవర శివ, ధర్మేంద్ర సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టులు

**ఆర్ట్స్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం.. ఈ నెల 28వ తేదీ చివరి తేది**

బలగం టీవీ, హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని వివిధ విభాగాల్లో పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానించింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం ఒక ప్రకటనలో ఈ వివరాలను తెలిపారు. సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, ఫిలాసఫీ తదితర విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనంగా, పీహెచ్‌డీ పూర్తి చేసి కానీ, లేక నెట్ లేదా సెట్ అర్హత సాధించి ఉండాలని స్పష్టం చేశారు.ఈ నియామకాలు పూర్తిగా ఉస్మానియా యూనివర్సిటీ నియమ, నిబంధనల ప్రకారం జరగనున్నట్లు ప్రొఫెసర్ కాసిం పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 28వ తేదీలోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొంటాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. వేములవాడ రూరల్ మండలం వట్టెముల గ్రామంలో ప్యాక్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.



ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా 240 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తున్నామని అన్నారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తామని ప్రకటించారు. రైతులు అధికారుల సూచన మేరకు ధాన్యం తరలించాలని, తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.

కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలని, సరిపడా టార్పలిన్ కవర్లు, గన్ని సంచులు,ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని ,రైతులు పండించిన పంట చివరి గింజా వరకు కొంటామని అన్నారు.

**ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీటలి**

ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లులను కోటీశ్వరులు చేయడం కోసం ఇందిర మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నమని అన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో సుమారు 600 కోట్లు పై చిలుకు బ్యాంక్ లింకజ్ ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.. రాష్ట్రంలో మొదటి విడతలో మహిళా సమైక్య సంఘాలకు బస్సు మంజూరు చేస్తే వేములవాడ రూరల్ మండల మహిళా సమైక్య కు 30 లక్షలతో బస్సు మంజూరు చేయడం జరిగిందని అన్నారు..మహిళలు ముందుకు వస్తె రైస్ మిల్లు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తాం అన్నారు..

# మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు వాడుకున్న పంచాయతీ సెక్రెటరీ..

- నిందితుడు అరెస్ట్.. రిమాండ్ కు తరలింపు..
- వివరాలు వెల్లడించిన ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్

**బలగం టీవీ, ఇల్లంతకుంట**




ఇల్లంతకుంట మండలంలోని ఓగులాపూర్ గ్రామపంచాయతీ చెందిన మాజీ పంచాయతీ కార్యదర్శి అయినా సయ్యద్ ముక్తార్ అహ్మద్ ప్రస్తుతం వీర్నపల్లి మండలం నకు బదిలీ అయినాడు. గతంలో ఓబులాపూర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహించిన సమయంలో 2025 సంవత్సరంలో జనవరి నుండి మే నెల వరకు వరకు ఓగులాపూర్ గ్రామపంచాయతీ నందు విధులు నిర్వహిస్తున్న ఐదుగురు మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వలేదని గతంలో కలెక్టర్ కి మల్టీపర్పస్ వర్కర్లు విజ్ఞప్తి చేసుకోవడం జరిగింది. అయితే ఆ విషయంపై పంచాయతీరాజ్ అధికారులు చేసిన విచారణలో సదరు పంచాయతీ సెక్రెటరీ మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వకుండా ఆ డబ్బులు మొత్తం 1,42,000/- లను తానే ఐదు చెక్కుల ద్వారా డ్రా చేసుకొని తన వ్యక్తిగత అవసరాల కోసం వాడుకోవడం జరిగింది అని విచారణలో తెలిసింది. ఈ విషయం గురించి మండల పంచాయతీ అధికారి అయినా మాణిక్యరావు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేయడం జరిగింది. తగిన సాక్షాధారాలు సేకరించిన తర్వాత పంచాయతీ సెక్రటరీ ముక్తార్ అహమ్మద్ ను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్ తరలించినట్లు ఎస్.ఐ. సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# అందుకున్న విజయాన్ని అందరికీ పంచుదాము..

- మహిళల అక్షరాభ్యాసం పూర్తి చేయాలి
- పేద గర్భిణీ, పిల్లలను దత్తత తీసుకోవాలి, పౌష్టికాహారం అందించాలి
- సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



అందుకున్న విజయాన్ని అందరికీ పంచుదాము అనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కింద పేద మహిళలను ఆర్థికంగా ఉన్నత స్థానాలకు తీసుకెళ్లలనేదే లక్ష్యమని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అన్నారు.గురువారం జిల్లాలోని సెర్ప్ డీపీఎంలు, ఏపీఎంలు, సీసీల తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా పలువురికి పోషకాహారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సెర్ప్ ప్రతిజ్ఞ ప్రకారంలి ప్రతి గ్రామంలోని పేద మహిళలు మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని, వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి ఆర్థికంగా ఎదిగేలా మద్దతు ఇవ్వాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఎస్ హెచ్ జీలకు భవనాలు ఉండాలని, సభ్యులందరూ అక్షరాభ్యాసం పూర్తి చేయాలని, వృద్ధ మహిళల, దివ్యాంగుల, కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, సోలార్ పవర్ యూనిట్, మండలానికి ఒక ఆర్టీసీ బస్సు ఇప్పించేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పేద గర్భిణీలు, పోషకాహార లోపం ఉన్న పిల్లలను దత్తత తీసుకుని వారికి పోషకాహారం అందించాలని పిలుపు ఇచ్చారు. ఎస్ హెచ్ జీలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని ఆదేశించారు. దీంతో మిగతా వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందనిఅన్నారు. రుణాల రికవరీలో జిల్లా రాష్ట్రంలోనే ముందు స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. రానున్న ఉగాదిలోగా జిల్లాలోని మహిళలందరూ కనీసం చదువుకొని తమ బ్యాంకు ఇతర అన్ని కార్యకలాపాలు పూర్తి చేసుకునేలా తీర్చిదిద్దాలని పిలుపు ఇచ్చారు. ప్రతి పేద మహిళ స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలుగా చేరాలని, వారు ఆర్థికంగా ఎదగాలని, విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు.

అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాలకు 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించామని, పేద ఎస్ హెచ్ జీ సభ్యులు ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు ఇప్పటిదాకా ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 10 కోట్లు ఇచ్చామని, వీఓ బిల్డింగ్స్ నిర్మాణానికి కృషి చేస్తామని, పెట్రోల్ బంక్, సోలార్ పవర్ యూనిట్ ఇతర పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, డిఆర్ డిఓ శేషాద్రి అడిషనల్ డిఆర్ డిఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల)గా బాధ్యతలు స్వీకరించిన గరిమా అగ్రవాల్

- సెలవులో వెళ్లిన కలెక్టర్ ఎం.హరిత..
- ఇన్‌చార్జి కలెక్టర్‌గా సైతం బాధ్యతలు చేపట్టిన గరిమా అగ్రవాల్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ చేరుకోగా, అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఎం హరిత సెలవుపై వెళ్లగా, ఇంచార్జి కలెక్టర్ గా సైతం గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ పూజలు..

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్లగా, ఆలయ అర్చకులు స్వస్తి వాచకంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వారికి అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఇంచార్జి కలెక్టర్ దంపతులకు ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి, అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు ఆలయ అధికారులు తదితరులు ఉన్నారు.

# రాజన్న జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలి..

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**



అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు విజయవంతంగా అమలు చేస్తూ,జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేలా పని చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు.గురువారం ఇంచార్జి కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూఅన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. రెసిడెన్షియల్, అన్ని విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందించాలని,ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరుకావాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నమస్తే తెలంగాణ కార్యాలయంపై దాడి హేయనీయం..

- దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలి..
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




హనుమకొండలో నమస్తే తెలంగాణ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా ఖండించారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు తమ ప్రజా పాలనను అర్థం చేసుకోలేక మీడియాపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. “ఇది ఇందిరమ్మ రాజ్యమా, ప్రజా పాలన అంటే దాడులేనా?” అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెస్తున్న పత్రికపై దాడి జరగడం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన వారిని ప్రభుత్వం వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో మట్టి శ్రీనివాస్, ఎస్.కె. అప్రోచ్ శ్రీనివాసరావు, హరీష్, అరికెళ్ళి వినయ్ కుమార్, సంపత్, సాయి, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియా సిరీస్ కైవసం

- రెండో వన్డేలో భారత్‌కు నిరాశ
- 2 వికెట్ల తేడాతో ఓటమి
- చివరి వరకు పోరాడిన బౌలర్లు

**బలగం టీవీ, అడిలైడ్**

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టుకు రెండో వన్డేలో నిరాశ ఎదురైంది. అడిలైడ్ ఓవల్ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది.ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0 తేడాతో కైవసం చేసుకుంది. భారత బౌలర్లు చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక వేళల్లో ఆసీస్ బ్యాటర్లు రాణించడంతో ఫలితం ప్రతికూలంగా మారింది.

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. భారత బ్యాటర్లు మొదటి నుంచే ఒత్తిడిలో పడ్డారు. శుభ్‌మన్ గిల్ (9), విరాట్ కోహ్లీ (0) త్వరగా ఔట్ కావడంతో భారత్ 17 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.అయితే రోహిత్ శర్మ (73 – 97 బంతులు), శ్రేయస్ అయ్యర్ (61 – 77 బంతులు) జట్టును ఆదుకుంటూ 118 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు.తరువాత అక్షర్ పటేల్ (44– 41 బంతులు) వేగంగా ఆడి భారత్‌ను 264/9 వరకు చేర్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా 4 వికెట్లు, జేవియర్ బార్ట్‌లెట్ 3, మిచెల్ స్టార్క్ 2 వికెట్లు తీశారు.







265 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా కూడా ఆరంభంలో వికెట్లు కోల్పోయింది. అయితే మాథ్యూ షార్ట్ (74 – 78 బంతులు) స్థిరంగా ఆడి జట్టును గెలుపు దిశగా నడిపించాడు. చివర్లో యువ ఆటగాడు కూపర్ కనోలీ (61 నాటౌట్ – 53 బంతులు) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి, మిచెల్ ఓవెన్ (36 – 23 బంతులు) మెరుపు ఇన్నింగ్స్‌తో సహకరించడంతో ఆసీస్ 46.2 ఓవర్లలో విజయం సాధించింది. అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ చెరో 2 వికెట్లు, సిరాజ్, అక్షర్ పటేల్ చెరో 1 వికెట్ తీశారు. ఈ విజయంతో సిరీస్‌ను ఆస్ట్రేలియా 2–0 తేడాతో సొంతం చేసుకుంది. ఇప్పుడు మిగిలిన మూడో వన్డే అక్టోబర్ 25న సిడ్నీలో జరగనుంది.



## ప్రభాస్ కొత్త సినిమా ఫౌజీ

**బలగం టీవీ, హైదరాబాద్**

దర్శకుడు హను రాఘవపూడి, రెబల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న కొత్త సినిమా ఫౌజీకి సంబంధించిన టైటిల్‌ను మేకర్స్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు. ఈ సినిమాకు అధికారికంగా ఫౌజీ అనే టైటిల్ ఫిక్స్ అయ్యింది. పోస్టర్‌లో ప్రభాస్ పవర్ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నాడు. పోస్టర్‌లో 'పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడు, పాండవుల పక్షాన ఉన్న కర్ణుడు, గురువు లేని ఏకలవ్యుడు, పుట్టుకతోనే యోధుడు' అనే సంస్కృత శ్లోకం వేసి, 'మన చరిత్రలో దాగిన అధ్యాయాల్లోని అత్యంత ధైర్యవంతుడైన సైనికుడి కథ' అంటూ క్యాప్షన్ పెట్టడం ద్వారా స్టోరీ లైన్‌ను అర్థం చేసుకోవచ్చునని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో ప్రభాస్ తన ప్రజలను కాపాడే యోధుడి పాత్రలో కనిపించనున్నారు.




డైరెక్టర్ హను ఇంటర్వ్యూలో, "మీరు ఇంతవరకు చూడని స్టోరీని ఈ సినిమా చూపిస్తుంది. ప్రభాస్ ఉండటం వల్ల సినిమా అన్ని అంచనాలను అందుకుంటుంది. 'సీతారామం' తర్వాత ఈ స్టోరీని రాయడానికే ఒక సంవత్సరం పెట్టాను. ఆడియెన్స్ తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీల్ అవుతారు" అని వెల్లడించారు.ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్‌గా టైటిల్ రిలీజ్ చేసి ప్రేక్షకులలో జోష్ పెంచారు. ఇప్పటికే షూటింగ్ వేగంగా సాగుతోంది. అభిమానులు మరిన్ని అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక సినిమాకి సంబంధించిన ఇతర అప్‌డేట్స్ విషయానికి వస్తే, అక్టోబర్ 31న ప్రభాస్ 'బాహుబలి: ది ఎపిక్' మళ్లీ థియేటర్లలో రిలీజ్ అవుతుంది. సంక్రాంతి 2026కి ప్రభాస్ కొత్త సినిమా 'ది రాజాసాబ్' విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', 'సలార్ 2', 'కల్కి 2' వంటి భారీ ప్రాజెక్ట్స్ కూడా ప్రీ–ప్రొడక్షన్, క్యూలో ఉన్నాయి.

## 'మా ఇంటి బంగారం'తో బిజీగా సమంత

- నందినీ రెడ్డి దర్శకత్వం
- షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభం


**బలగం టీవీ, హైదరాబాద్**




నటి సమంత తన తదుపరి సినిమా పనులపై పూర్తి ఫోకస్ పెట్టింది. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' అక్టోబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుందని ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రకటించగా, తాజా సమాచారం ప్రకారం హైదరాబాద్‌లో బుధవారం నుంచే షఉటింగ్ ప్రారంభ మైంది. ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా, ఆమె స్వంత ప్రొడక్షన్ హౌస్ Tralala Moving Pictures బ్యానర్‌పై రూపొందుతున్న మొదటి చిత్రం కావడం విశేషం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలను నందినీ రెడ్డి టీం వెల్లడించనుంది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్‌లో గృహిణిగా చేతిలో గన్ పట్టుకున్న లుక్‌లో కనిపిస్తున్న సామ్.. మరి మా ఇంటి బంగారంలో ఎలాంటి రోల్‌లో కనిపించబోతుందన్నది ఆసక్తి నెలకొంది.

## రాజాసాబ్ నుంచి స్పెషల్ పోస్టర్

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ దర్శకుడు మారుతి మరియు గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో రూపొందుతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ 'రాజాసాబ్' హారర్ కామెడీ జోనర్‌లో, పాన్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ పోస్టర్‌లో కార్ రూఫ్‌టాప్‌పై స్టైలిష్‌గా కూర్చున్న ప్రభాస్‌కి 'గ్రాండ్ వెల్ కమ్' పలికే స్టిల్ అభిమానుల్లో పెద్ద ఉత్సాహాన్ని కలిగించింది.

రాజాసాబ్ ట్రైలర్ ఇప్పటికే లాంచ్ అయ్యి, కామెడీ, లవ్, రొమాన్స్, హార్రర్ వంటి ఎలిమెంట్స్‌తో మరింత ఆకట్టుకుంటున్నట్టు సూచిస్తుంది. మారుతి మార్క్ కామెడీ టచ్‌తో ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయనున్నారు. గ్లింప్స్‌లో ప్రభాస్ చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ, పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపించడం అభిమానులకు ఒక విజువల్ ట్రీట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అలాగే, రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించనున్నారు.



## 'మన శంకరవరప్రసాద్‌గారు' సెట్‌లో అడుగుపెట్టిన వెంకటేష్

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి మరియు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా మేకర్స్ సినిమా నుండి సాలిడ్ అప్‌డేట్‌ను విడుదల చేశారు. వార్తల ప్రకారం, ఈ సినిమాలో స్టార్ నటుడు విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటించనున్నాడు. చిరంజీవి ఎక్స్ వేదికగా ప్రకటించిన వివరాల ప్రకారం, వెంకటేష్ సెట్స్‌లో అడుగుపెట్టేశారు. ఆయన ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. కథానాయికగా నయనతార నటిస్తుండగా, షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## రూ.100 కోట్ల క్లబ్‌లో 'డ్యూడ్'

**బలగం టీవీ, హైదరాబాద్**




తమిళ స్టార్ నటుడు ప్రదీప్ రంగనాథన్ మరోసారి రికార్డు సృష్టించారు. తాజాగా విడుదలైన 'డ్యూడ్' సినిమా రూ.100 కోట్ల క్లబ్ చేరడంతో, వరుసగా మూడు సినిమాలు వంద కోట్ల వసూళ్లను దాటిన హ్యాట్రిక్‌ను ఆయన సాధించారు. ప్రదీప్ తన కెరీర్‌లో మొదటి సినిమా'లవ్ టుడే'తో రూ.100 కోట్ల వసూళ్లను సాధించి, ఆ తరువాత విడుదలైన 'డ్రాగన్'తో రూ.150 కోట్ల వసూళ్లను అందుకున్నారు. తాజాగా 'డ్యూడ్' ద్వారా మళ్లీ రూ.100 కోట్ల వసూళ్లను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమాకు కీర్తీశ్వరన్ దర్శకత్వం వహించారు. హీరోయిన్‌గా మమితా బైజు, శరత్ కుమార్, నేహా శెట్టి ముఖ్య పాత్రల్లో నటించారు. టాలీవుడ్ స్టార్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

## పోలీసు పాత్రలో సుమ

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమంటే'. 'థ్రిల్ ప్రాప్తిరస్తు' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ చిత్రాన్ని సునీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. లవ్, కామెడీ, థ్రిల్లింగ్ అంశాలతో రాబోతున్న ఈ చిత్రం నుండి తాజాగా సుమ కనకాల పాత్రని పరిచయం చేశారు. 'సాధారణ పోలీసు కాదు.. నవ్వడానికి సిద్ధంగా ఉండండి.. ఫైనల్‌గా సుమ కామెడీ టైమింగ్‌ని బిగ్ స్క్రీన్‌పై చూడబోతున్నాం' అంటూ సోషల్‌మీడియాలో ఈ కొత్త పోస్టర్‌ని రిలీజ్‌చేశారు.



## తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తేజ సజ్జా

**బలగం టీవీ, తిరుమల**

యువ కథానాయకుడు తేజ సజ్జా గురువారం ఉదయం కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వెళ్లారు. ఈ సందర్భంగా, ఆయన నటించిన తాజా చిత్రం 'మిరాయి' దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలయానికి చేరిన తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని ను తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అధికారులు ఘనంగా స్వాగతించి, వీఐపీ దర్శన ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేద ఆశీర్వచనం చేశారు మరియు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. 'మిరాయి' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం సాధించిందని, ప్రస్తుతానికి జియో హాట్‌స్టార్ వేదికపై స్ట్రీమింగ్ అవుతున్నది.

## ఎదురైన ఎగతాళిపై సమంత ఆవేదన

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రసిద్ధ నటి సమంత తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన కష్టాలను గుర్తుచేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. విడాకులు, అనారోగ్య సమస్యల కారణంగా తీవ్రంగా బాధపడుతున్న సమయంలో కొందరు ఆమెను ద్వేషిస్తూ ఎగతాళి చేశారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సమంత తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమంత మాట్లాడుతూ, "నా జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు చూశాను. ముఖ్యంగా నాగ చైతన్యతో విడిపోయినప్పుడు, మయోసైటిస్ బారిన పడినప్పుడు కొందరు పైశాచిక ఆనందం పొందారు. నా భవిష్యత్తుపై వారే నిర్ణయాలు తీసుకున్నట్లు మాట్లాడారు. మొదట్లో ఆ వ్యాఖ్యలు నన్ను బాధపెట్టాయి, కానీ ఇప్పుడు అలాంటి వారిని పట్టించుకోవడం మానేశాను" అని తెలిపారు. ఆ వ్యాఖ్యలకు స్పందిస్తూ అభిమానులు సోషల్ మీడియాలో మద్దతు తెలుపుతున్నారు. "సమంత ఒక నిజమైన ఫైటర్" అంటూ ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తున్నారు.